'జమిలి'కి తొలి అడుగు

- లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- తీవ్రంగా వ్యతిరేకించిన ఇండియా కూటమి పార్టీలు
- బిల్లులు ప్రవేశపెట్టడానికి ఓటింగ్ నిర్వహణ
- అనుకూలంగా 269.. వ్యతిరేకంగా 198 ఓట్లు
- జేపీసీకి బిల్లులు పంపిస్తామన్న కేంద్ర సర్కార్

జమిలి బిల్లు ప్రవేశ పెట్టడానికి చేతులెత్తి ఆమోదం తెలుపుతున్న ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: లోక్‌సభతో పాటు అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే దిశగా కీలక అడుగు పడింది. జమిలి ఎన్నికలకు వీలు కల్పించే రెండు బిల్లులను మంగళవారం కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అంతకుముందు బిల్లులు ప్రవేశపెట్టడంపై 90 నిమిషాల పాటు సభలో చర్చ జరిగింది. జమిలి బిల్లులను ప్రవేశపెట్టడం కోసం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఇచ్చిన తీర్మానంపై స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించగా 269 మంది జమిలి బిల్లులకు మద్దతునిచ్చారు. 198 మంది వ్యతిరేకించారు. దీంతో అర్జున్‌రామ్ మేఘ్వాల్ సభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. ఇందులో ఒకటి రాజ్యాంగ(129వ సవరణ) బిల్లు కాగా, మరొకటి కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు. ఈ బిల్లులను జేపీసీకి పంపుతూ బుధవారం తీర్మానం చేసే అవకాశం ఉంది.

జేపీసీకి పంపిస్తాం: అమిత్ షా

జమిలి ఎన్నికల బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపించనున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రారంభ దశలోనే ఈ బిల్లులపై విస్తృత చర్చలు జరగాలని ప్రధాని చెప్పినట్టు తెలిపారు. జేపీసీ ఇచ్చే నివేదికను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన తర్వాత మళ్లీ పార్లమెంటులో చర్చించవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టు ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడి కాదని అర్జున్‌రామ్ మేఘ్వాల్ పేర్కొన్నారు.

నియంతృత్వాన్ని తీసుకొచ్చే ప్రయత్నం: ప్రతిపక్షాలు

జమిలి ఎన్నికల బిల్లులను ఇండియా కూటమి పార్టీలు, ఎంఐఎం తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ బిల్లులను ప్రవేశపెట్టడం దేశంలో నియంతృత్వాన్ని తీసుకువచ్చేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నమేనని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ ఆరోపించారు. ఈ బిల్లులు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తున్నాయని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం లేదా పార్లమెంటు కింద ఉండవని, ఈ బిల్లులు రాష్ట్రాల అసెంబ్లీల స్వతంత్రతను లాగేసుకుంటున్నాయని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ పేర్కొన్నారు. ఇది ఏమాత్రం ఎన్నికల సంస్కరణ కాదని, కేవలం ఒక వ్యక్తి కోరిక, కలను నెరవేర్చడమేనని అన్నారు. ఎన్డీఏయేతర పార్టీల్లో వైసీపీ మాత్రమే జమిలి బిల్లులకు మద్దతు ఇచ్చింది.

దేశంలో జమిలి ఎన్నికల చరిత్ర..

దేశంలో జమిలి ఎన్నికల ఆలోచన ఇప్పటిది కాదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. జమిలి ఎన్నికలపై కేంద్రం మంగళవారం అధికారిక వివరణ ఇచ్చింది. రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టిన తర్వాత 1951-52, 1957, 1962, 1967లో లోక్‌సభ, అన్ని అసెంబ్లీలకు ఒకే సారి ఎన్నికలు జరిగాయి. 1968, 1969లో పలు రాష్ట్రాల అసెంబ్లీలు ఐదేండ్లకు ముందే రద్దు కావడం వల్ల జమిలి ఎన్నికలకు ఆటంకం ఏర్పడింది. 1970లో నాలుగో లోక్‌సభ కూడా ముందే రద్దు కావడంతో 1971లో ఎన్నికలు జరిగాయి. ఐదో లోక్‌సభ వ్యవధిని ఎమర్జెన్సీ కారణంగా 1977 వరకు పొడిగించారు.

31 మందితో జేపీసీ.. 90 రోజుల్లో నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: జమిలి బిల్లుపై అధ్యయనానికి ఏర్పాటు చేయనున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో గరిష్ఠంగా 31 మంది ఎంపీలు ఉంటారు. అందులో 21 మంది లోక్‌సభకు చెందిన వారు. ఏకకాలంలో శాసన సభలకు, పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా తెచ్చిన రాజ్యాంగ (129వ) సవరణ బిల్లును వీరు పూర్తిగా అధ్యయనం చేస్తారు. జేపీసీ కూర్పును రాజ్యసభ స్పీకర్ ఓం బిర్లా 48 గంటల్లో ప్రకటించనున్నారు. పార్లమెంట్ సమావేశాలు శుక్రవారంతో ముగియనున్నందున ఈ డెడ్‌లైన్ విధించారు. ఆలోగా జేపీసీ ఏర్పడకపోతే బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనే తిరిగి ప్రవేశపెట్టాలి. కమిటీలో ప్రాతినిధ్యం కోసం ఎంపీల పేర్లను ప్రతిపాదించాలని వివిధ పార్టీలను కోరినట్టు తెలిసింది. ఈ కమిటీ ఏర్పడిన తర్వాత 90 రోజుల్లో నివేదిక సమర్పిస్తుంది.

పార్టీ ఎంపీల గైర్హాజరీపై బీజేపీ అధిష్ఠానం సీరియస్

20 మంది ఎంపీలు ఓటింగ్‌కు డుమ్మా

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంగళవారం లోక్‌సభలో ఓటింగ్ జరిగిన సమయంలో దాదాపు 20 మంది పార్టీ ఎంపీలు హాజరు కాకపోవడంపై బీజేపీ ఆరా తీస్తోంది. సభ్యులందరూ సభలో హాజరుకావాలని ఆదేశిస్తూ పార్టీ విప్ జారీచేసినప్పటికీ పార్టీకి చెందిన చాలా మంది ఎంపీలు డుమ్మా కొట్టడంపై బీజేపీ నాయకత్వం మండిపడుతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వారికి నోటీసులు జారీచేయనున్నట్టు తెలిసింది. అయితే వివిధ వ్యక్తిగత, పని సంబంధ కారణాల వల్ల తాము సభకు హాజరుకాలేమని కొందరు ఎంపీలు ముందుగానే పార్టీకి సమాచారం ఇచ్చారని ఆ వర్గాలు వివరించాయి.

బిల్లు ఏం చెప్తున్నది?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): లోక్‌సభలో మంగళవారం జమిలి ఎన్నికలకు సంబంధించి కేంద్రం ప్రవేశపెట్టిన రెండు బిల్లుల్లో మొదటిది లోక్‌సభ, అసెంబ్లీల కాలపరిమితులను సవరించే రాజ్యాంగ సవరణ బిల్లు కాగా రెండోది ఢిల్లీ, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికలకు సంబంధించినది.

- **బిల్లులో ఏ ఆర్టికల్ ఏం చెప్తున్నది?**

ఏకకాల ఎన్నికల నిర్వహణకు 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2024లో రాజ్యాంగంలోని మూడు ఆర్టికల్స్‌ను సవరించడంతో పాటు కొత్తగా ఆర్టికల్ 82ఏను చేర్చాలని కేంద్రం బిల్లులో ప్రతిపాదించింది.

- **ఆర్టికల్ 82ఏలో తీసుకొచ్చే ఆరు క్లాజులు**

- **ఆర్టికల్ 82ఏ(1):** జమిలి బిల్లు ఆమోదం పొందిన తర్వాత సాధారణ ఎన్నికలు జరిగిన పిదప కొలువుదీరే తొలి లోక్‌సభలో రాష్ట్రపతి ఈ క్లాజును నోటిఫై చేయాలి. ఆ రోజునే అపాయింటెడ్ డేగా పరిగణించాలి.
- **ఆర్టికల్ 82ఏ(2):** అపాయింటెడ్ డే తర్వాత ఏర్పడిన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితి ఆ లోక్‌సభ కాల పరిమితితోనే ముగుస్తుంది. అంటే అవసరమైతే, అసెంబ్లీల కాలపరిమితిలో కుదింపు జరుగొచ్చు. అలాగే, లోక్‌సభ కంటే ముందు ఏర్పడిన అసెంబ్లీల కాల పరిమితి లోక్‌సభ కాలపరిమితికి అనుగుణంగా పొడిగింపు కూడా ఉంటుంది.
- **ఆర్టికల్ 82ఏ(3):** లోక్‌సభకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల సంఘం (ఈసీ) ఎలక్షన్స్‌ను నిర్వహిస్తుంది.
- ఆర్టికల్ 82ఏ(4): ఈ క్లాజు జమిలి ఎన్నికలను నిర్వచిస్తుంది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాల ఎన్నికలు నిర్వహించడమే దీని లక్ష్యం.
- **ఆర్టికల్ 82ఏ(5):** కొన్ని అనివార్య పరిస్థితులు తలెత్తినప్పుడు లోక్‌సభతో పాటు ఏదైనా అసెంబ్లీకి ఒకేసారి ఎన్నికలను నిర్వహించలేని వెసులుబాటు ఈసీ కలిగి ఉంది.
- **ఆర్టికల్ 82ఏ(6):** లోక్‌సభతో కాకుండా కొంత జాప్యంతో ఎన్నికలు జరిగిన అసెంబ్లీ కాలపరిమితి ఆ లోక్‌సభతోనే ముగిసిపోతుంది.

- **సవరణ చేయబోతున్న ఆర్టికల్స్**

ఆర్టికల్ 83: ఈ ఆర్టికల్‌లో మళ్లీ ఐదు క్లాజులు ఉన్నాయి. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఐదేండ్ల కాలపరిమితి ఉంటుందని తొలి క్లాజు పేర్కొంటున్నది. ఐదేండ్ల కాలపరిమితితో కొలువుదీరే లోక్‌సభ మధ్యలో రద్దైతే మిగిలిన కాలాన్ని వీగిపోని కాలంగా (అన్‌ఎక్స్పైర్డ్ టర్మ్) పరిగణించాలని రెండో క్లాజు చెప్తుంది. లోక్‌సభ రద్దైన తర్వాత మిడ్‌టర్మ్ ఎన్నికలతో కొత్త లోక్‌సభ కొలువుదీరుతుందని మూడో క్లాజు తెలియజేస్తుంది. అలా ఏర్పడిన కొత్త లోక్‌సభ మిగిలిన కాలానికి మాత్రమే (ఐదేండ్ల కంటే తక్కువ) ఉంటుందని నాలుగో క్లాజు చెప్తుంది. మిడ్‌టర్మ్ ఎలక్షన్స్ ద్వారా కొలువుదీరిన లోక్‌సభ.. అంతకు ముందు రద్దైన లోక్‌సభ కాలంతో కలిపి మొత్తంగా ఐదు ఏండ్లు పూర్తికాగానే మళ్లీ సాధారణ ఎన్నికలు నిర్వహించాలని ఐదో క్లాజు చెప్తున్నది.

ఆర్టికల్ 172: ఆర్టికల్ 83లోని ఐదు క్లాజులు ఎలాగైతే లోక్‌సభ కాలపరిమితికి సంబంధించిన నిబంధనలను వెల్లడించాయో.. ఆర్టికల్ 172 క్లాజులు అసెంబ్లీలకు అలాగే వర్తిస్తాయి. అసెంబ్లీల కాలవ్యవధి అనేది లోక్‌సభకు అనుగుణంగానే ఉంటుంది.

ఆర్టికల్ 327: రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విషయాలు (ఎలక్టోరల్ రోల్, నియోజకవర్గాల పునర్విభజన వగైరా) పార్లమెంట్ నిర్ణయిస్తుందని ఈ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

2034లోనే జమిలి!

బిల్లులోని అంశాలను బట్టి అంచనా వేస్తున్న నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): అసలు ఏకకాల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. జమిలి ఎన్నికలకు అపాయింటెడ్ తేదీగా లోక్‌సభ తొలిసారిగా సమావేశమైన రోజును గుర్తించాలని కోవింద్ కమిటీ ఇదివరకే సిఫారసు చేసింది. ఈ క్రమంలో రాజ్యాంగంలో కొత్తగా పొందుపర్చబోతున్న ఆర్టికల్ 82ఏలోని తొలి క్లాజు ఏకకాల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్న విషయాన్ని కచ్చితత్వంతో చెప్తున్నట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

పదేండ్ల తర్వాతనే..

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. జమిలి తాజా బిల్లులో పేర్కొన్న విషయాలను బట్టి సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత సమావేశమయ్యే తొలి లోక్‌సభ సమావేశంలో ఆర్టికల్ 82ఏను రాష్ట్రపతి నోటిఫై చేయనున్నట్టు వెల్లడించారు. ఆ రోజునే అపాయింటెడ్ డేగా తీసుకొంటారు. 18వ లోక్‌సభ ఎన్నికలు గత మే-జూన్‌లో జరిగిపోయాయి. గత జూన్‌లోనే తొలిసారిగా లోక్‌సభ సమావేశం పూర్తైంది. ఈ లెక్కన 2029లో సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత ఏర్పడే తొలి లోక్‌సభ సమావేశంలోనే రాష్ట్రపతి ఆర్టికల్ 82ఏను నోటిఫై చేయాల్సి ఉంటుంది. ఈ ఆర్టికల్ నోటిఫై అయ్యాకే.. అంటే ఆ రోజు నుంచి ఐదేండ్ల కాలపరిమితి ముగిసిన తర్వాతనే లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సదరు క్లాజులో పేర్కొన్నారు. ఈ లెక్కన 2034లోనే జమిలి ఎన్నికలు నిర్వహించనున్నట్టు బిల్లు స్పష్టం చేస్తున్నదని నిపుణులు చెప్తున్నారు.

పురుగుమందుల నుంచి రక్షణ కల్పించే కిసాన్ కవచ్

ధర రూ.4,000.. కనీసం ఏడాది వాడొచ్చు

న్యూఢిల్లీ : సేద్యంలో పురుగుమందుల వాడకం తప్పనిసరి. వీటి ప్రభావానికి గురికాకుండా రైతుల రక్షణ కోసం ప్రత్యేకమైన బాడీసూట్(దుస్తులు) 'కిసాన్ కవచ్' మార్కెట్లోకి రాబోతున్నాయి. పురుగుమందు నిరోధక బాడీసూట్(కిసాన్ కవచ్)ను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మంగళవారం న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. కిసాన్ కవచ్ మొదటి బ్యాచ్ దుస్తుల్ని ఆయన కొంతమంది రైతులకు పంపిణీ చేశారు. పురుగుమందుల వాడకంలో హానికారక రసాయనాల ప్రభావానికి గురికాకుండా 'కిసాన్ కవచ్' దుస్తులు రక్షణ కల్పిస్తాయి. తద్వారా రైతుల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దుస్తులు కాపాడుతాయి. బెంగళూరుకు చెందిన 'బ్రిక్-ఇన్‌స్టెమ్', సెపియో హెల్త్ ప్రై.లిమిటెడ్ సంయుక్తంగా తయారుచేసిన 'కిసాన్ కవచ్' దుస్తుల ధర రూ.4,000. వీటిని ఉతికి, కనీసం 150 మార్లు వినియోగించవచ్చునని సంస్థ తెలిపింది. 'ఉతికి, తిరిగి వాడగలిగే ఈ సూట్‌ను కనీసం ఏడాది ఉపయోగించవచ్చు. అత్యంత అధునాతన ఫ్యాబ్రిక్ టెక్నాలజీ పురుగుమందుల ప్రభావాన్ని డీయాక్టివేట్ చేస్తుంది' అని జితేంద్ర సింగ్ చెప్పారు.

చాట్‌జీపీటీ సెర్చ్ ఇంజిన్ ఇకపై ఫ్రీ

గూగుల్ గుత్తాధిపత్యానికి చెక్!

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: చాట్‌జీపీటీ సెర్చ్ ఇంజిన్ యూజర్లకు గుడ్ న్యూస్! ఇప్పటివరకు 'పెయిడ్ యూజర్ల'కు మాత్రమే అందుబాటులో ఉన్న చాట్‌జీపీటీ సెర్చ్ ఇంజిన్.. ఇకపై ఉచితంగా అందరికీ అందుబాటులోకి రానున్నది. ఈ విషయాన్ని 'ఓపెన్ ఏఐ' చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ కెవిన్ వీల్ ప్రకటించారు. ఇక నుంచి యూజర్లు.. చాట్‌జీపీటీ వెబ్‌సైట్, యాప్‌ను ఉచితంగా వాడుకోవచ్చు. యూజర్ల నుంచిఎలాంటి రుసుములూ వసూలు చేయటం లేదని కంపెనీ తెలిపింది.గూగుల్ గుత్తాధిపత్యానికి చెక్ పెట్టడానికే ఈ నిర్ణయం తీసుకుంది.

హష్ మనీ కేసులో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

న్యూయార్క్, డిసెంబర్ 17: అధ్యక్షుడికి న్యాయ రక్షణ ఉంటుందన్న కారణాన్ని చూపి హష్ మనీ కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. దీంతో ట్రంప్ భవితవ్యం సందిగ్ధంలో పడింది. అధ్యక్షుడిగా అధికారిక చర్యలకు మాత్రమే న్యాయరక్షణ ఉంటుందని, అనధికారిక చర్యలకు కాదని మన్‌హట్టన్ జడ్జి జువాన్ ఎం మెర్చన్ సోమవారం స్పష్టం చేశారు. శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో వ్యవహారం బయట పడకుండా ట్రంప్ ఆమెకు 1.10 కోట్లు ముట్టచెప్పారనేది ఆరోపణ.

ఇరాన్‌లో హిజాబ్ చట్టం రద్దు

టెహ్రాన్, డిసెంబర్ 17: ఇస్లామిక్ డ్రెస్ కోడ్‌ను పాటించని మహిళలను శిక్షించడానికి ఉద్దేశించిన వివాదాస్పద హిజాబ్ చట్టం అమలును ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌కు చెందిన సుప్రీమ్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సస్పెండ్ చేసింది. దీనికి వ్యతిరేకంగా దేశీయంగా, అంత ర్జాతీయంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయా న్ని తీసుకుంది. ఈ కొత్త చట్టంపై గతంలో మానవ హక్కుల సంఘా లు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీన్ని క్రూరమైన చట్టంగా ఆమ్నెస్టీ పేర్కొంది.

భవన నిర్మాణాలు సాగాలిలా..

- మార్గదర్శకాలు జారీ చేసిన సుప్రీంకోర్టు
- అక్రమ, అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట
- కీలకం కానున్న కంప్లీషన్ సర్టిఫికెట్

అక్రమ నిర్మాణాలపై కీలక మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: అక్రమ, అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. బిల్డర్లు, నిర్మాణదారులు, అధికారులు పాటించాల్సిన చర్యలపై మంగళవారం కీలక సూచనలు చేసింది. నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మీరట్‌లో అనుమతిలేని వాణిజ్య భవనాన్ని కూల్చివేయాలని అలహాబాద్ హైకోర్టు 2014లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాజేంద్ర కుమార్ బర్జాత్య అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం.. అలహాబాద్ హైకోర్టు తీర్పును సమర్థించింది. అక్రమ నిర్మాణాలపై చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేస్తూ 36 పేజీల తీర్పు ఇచ్చింది.

- భవన నిర్మాణం పూర్తయ్యాక సంబంధిత అధికారులు బిల్డర్ లేదా నిర్మాణదారుడికి కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలి.
- ఈ సర్టిఫికెట్ వచ్చిన తర్వాతే భవనాన్ని బిల్డర్ వినియోగదారులకు అప్పగించాలి.
- ఈ మేరకు భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చేటప్పుడే బిల్డర్ నుంచి అధికారులు హామీ(అండర్‌టేకింగ్) పొందాలి.
- నిర్మాణం కొనసాగినన్ని రోజులు భవన నిర్మాణ ప్రణాళిక కాపీని నిర్మాణ స్థలం వద్ద ప్రదర్శించాలి.
- నిర్మాణ స్థలాన్ని అధికారులు పలుమార్లు తనిఖీ చేపట్టి, వివరాలను అధికారిక రికార్డుల్లో నమోదు చేయాలి.
- నిర్మాణం పూర్తయిన తర్వాత అధికారులు పరిశీలించాలి. నిబంధనలు, ఆమోదించిన ప్రణాళిక మేరకే నిర్మాణం జరిగిందని సంతృప్తి చెందిన తర్వాతే కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలి.
- ఏదైనా అతిక్రమణను గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు డీవియేషన్లను సరి చేసే వరకు కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేయొద్దు.
- కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్‌ను సమర్పించాకే భవనానికి విద్యుత్తు, నీటి సరఫరా, మురుగు కనెక్షన్లను ఇవ్వాలి.
- ప్రణాళికను ఉల్లంఘించి నిర్మాణం జరిగినట్టు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చాక అధికారులకు తెలిసినా వెంటనే చట్టప్రకారం యాజమానిపై చర్యలు తీసుకోవాలి.
- కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదని బిల్డర్ చేసే దరఖాస్తులు, అనధికార నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం వచ్చే దరఖాస్తులను అధికారులు 90 రోజుల లోపు వీలైనంత త్వరగా పరిష్కరించాలి.
- కంప్లీషన్ సర్టిఫికెట్‌ను పరిశీలించిన తర్వాతే భవనంపై బ్యాంకులు, రుణ సంస్థలు రుణాన్ని జారీ చేయాలి.

ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలి

పీఎం కిసాన్ సాయాన్ని రెట్టింపు చేయాలి

కేంద్రానికి పార్లమెంటరీ ప్యానెల్ సిఫారసు

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్పీ) చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటరీ స్థాయి సంఘం కేంద్రానికి మంగళవారం సిఫారసు చేసింది. దీని వల్ల రైతుల ఆత్మహత్యలను తగ్గించడంతో పాటు వారికి ఆర్థిక స్థిరత్వం కల్పించవచ్చని తెలిపింది. అలాగే పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుతం రైతులకు ఏటా అందిస్తున్న రూ.6 వేల ఆర్థిక సాయాన్ని రూ.12 వేలకు పెంచాలని ప్రతిపాదించింది. వ్యవసాయం, పశు సంవర్ధకం, ఆహార ప్రాసెసింగ్‌పై ఏర్పాటైన ఈ ప్యానెల్ ఈ మేరకు పార్లమెంట్‌కు సమగ్ర నివేదిక సమర్పించింది. 'వీలైనంత త్వరగా ఎంఎస్పీని చట్టబద్ధంగా అమలు చేయడానికి ఒక మార్గసూచిని రూపొందించాలని వ్యవసాయ శాఖకు ప్యానెల్ గట్టిగా ప్రతిపాదించింది' అని నివేదిక పేర్కొంది. పంట వ్యర్థాల నిర్వహణకు పరిహారం అందించడం, వ్యవసాయ కూలీలకు కనీస జీవన వేతనాల అమలు కోసం జాతీయ కమిషన్ ఏర్పాటు, రైతులు, రైతు కూలీల కోసం రుణ మాఫీ పథకం ప్రవేశపెట్టడం తదితర సిఫారసులను చేసింది. ఎంఎస్పీ ద్వారా వచ్చే ఆదాయం రైతులను వ్యవసాయంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేలా చేస్తుందని కమిటీ వివరించింది. ప్రతి పంట కాలం తర్వాత ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎంఎస్పీకి పంటలను అమ్ముతున్న రైతుల సంఖ్యను, ఎంఎస్పీకి-మార్కెట్ ధరలకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రకటించాలని పార్లమెంటరీ కమిటీ కోరింది.

బీజేపీ చీఫ్‌గా శివరాజ్ సింగ్ చౌహాన్?

రేసులో గడ్కరీ సైతం!

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: బీజేపీ అధ్యక్షునిగా జేపీ నడ్డా వారసునిపై పార్టీలో చర్చ ప్రారంభమైంది. ఫిబ్రవరి నెలాఖరు కల్లా పార్టీ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ చీఫ్‌గా ప్రస్తుత కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ప్రముఖంగా విన్పిస్తున్నది. ఆర్‌ఎస్‌ఎస్ ఆశీస్సులు మెండుగా ఉన్న మంత్రి నితిన్ గడ్కరీ కూడా రేసులో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న వారికీ ఈ పదవి రావచ్చునని పార్టీలో ప్రచారం జరుగుతున్నది.

ట్రావెల్ ఏజెంట్ మోసం.. 22 ఏండ్ల తర్వాత భారత్‌కు

లాహోర్: ట్రావెల్ ఏజెంట్ చేతిలో మోసపోయి 22 ఏండ్లుగా పాకిస్థాన్‌లో ఉన్న భారతీయ మహిళ సోమవారం స్వదేశానికి చేరుకుంది. వాఘా సరిహద్దు నుంచి ఆమె భారత్‌లోకి ప్రవేశించిందని ఓ అధికారి తెలిపారు. బాధితురాలైన హమీదా బానో కథనం ప్రకారం ముంబైకి చెందిన ఆమె 2002లో పాకిస్థాన్‌లోని హైదరాబాద్‌కు వచ్చింది. దుబాయ్‌లో వంట మనిషి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆమెను మోసం చేసిన ఓ ట్రావెల్ ఏజెంట్ ఆమెను పాకిస్థాన్‌లో వదిలి పెట్టి వెళ్లిపోయాడు. ఆమె అక్కడే ఒక పాకిస్థానీని పెండ్లి చేసుకొంది. 2022లో స్థానిక యూట్యూబర్ ఆమె గురించి చేసిన వ్లాగ్ ఆమెను తిరిగి కుటుంబం దగ్గరకు చేరేలా చేసింది.

త్వరలో కెనడా ప్రధాని రాజీనామా?

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: కెనడాలో సిక్కు ఓటర్ల ప్రాపకం కోసం భారత్‌పై విషప్రచారం చేస్తున్న ప్రధాన మంత్రి జస్టిన్ ట్రుడోకు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. దీంతో త్వరలో ప్రధాని పదవికి ట్రూడో రాజీనామా చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ట్రూడోతో తలెత్తిన విధానపరమైన విభేదాల వల్ల కెనడా ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీల్యాండ్ తన పదవికి రాజీనామా చేశారు. తాజాగా ఆయన మిత్రుడు, ఖలిస్థానీ మద్దతుదారుడు, ఎన్‌డీపీ నేత జగ్మీత్ సింగ్ కూడా ట్రూడో రాజీనామా చేయాలని పట్టుబట్టాడు.

పీఎఫ్ విత్‌డ్రాకు సెల్ఫ్ అప్రూవల్!

- ఖాతాదారులే పీఎఫ్ విత్‌డ్రాను ఆమోదించుకునే అవకాశం
- త్వరలోనే కొత్త విధానం అమల్లోకి

న్యూఢిల్లీ: ఈపీఎఫ్ఓ ఖాతాదారులు పీఎఫ్ సొమ్మును మరింత సులభంగా, వేగంగా విత్‌డ్రా చేసుకునే కొత్త విధానం అందుబాటులోకి రానున్నది. దరఖాస్తు చేసుకున్న తర్వాత ఈపీఎఫ్ఓ నుంచి ఆమోదం వచ్చే వరకు ఎదురుచూడాల్సిన పని లేదు. ఖాతాదారులే సొంతంగా పీఎఫ్ విత్‌డ్రాను ఆమోదించుకోవచ్చు. ఈ మేరకు వచ్చే ఏడాది మార్చిలో ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) కొత్త సెల్ఫ్ అప్రూవల్ విధానాన్ని తీసుకురానున్నట్టు ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం పీఎఫ్ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఈపీఎఫ్ఓ అధికారులు మాన్యువల్‌గా పరిశీలించిన తర్వాత ఆమోదిస్తారు. ఆమోదం లభించిన రెండుమూడు రోజులకు బ్యాంకు ఖాతాలోకి డబ్బులు జమ అవుతాయి. ఈ మొత్తం ప్రక్రియకు కనీసం 7-10 రోజులు పడుతున్నది.

సెల్ఫ్ అప్రూవల్ ఇలా..

ఈపీఎఫ్ఓ తీసుకురానున్న కొత్త విధానం వచ్చిన అనంతరం పీఎఫ్ సొమ్ము విత్‌డ్రా చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న తర్వాత ఖాతాదారులే సొంతంగా ఆమోదించుకోవచ్చు. ఈపీఎఫ్ఓ అధికారులు మాన్యువల్‌గా పరిశీలించే పద్ధతి ఉండదు. దీంతో పీఎఫ్ డబ్బులు వేగంగా పొందవచ్చు. అయితే, ఏ అవసరానికి ఎంత మేరకు పీఎఫ్ బ్యాలెన్స్‌ను తీసుకోవచ్చు అనే దానికి సంబంధించిన పరిమితులు మాత్రం కొనసాగనున్నాయి. క్లెయిమ్ చేసుకున్న డబ్బులు ఉండేలా డిజిటల్ వాలెట్‌ను తీసుకురావాలని ఈపీఎఫ్ఓ భావిస్తున్నది. ఇందుకోసం ఆర్బీఐతో చర్చిస్తున్నది. తాత్కాలిక ద్రవ్య సర్దుబాటు కోసం వాణిజ్య బ్యాంకుల క్యాష్-క్రెడిట్ సదుపాయాలను ఈపీఎఫ్ఓ వినియోగించుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఖాతాదారులు ఉద్యోగాలు మారినప్పుడు మెంబర్ ఐడీలు బదిలీ చేసుకోవాల్సిన అవసరాన్ని ఈపీఎఫ్ఓ తొలగించనున్నది.

బాంబు బెదిరింపులకు పాల్పడితే కోటి జరిమానా

న్యూఢిల్లీ: నకిలీ బాంబు బెదిరింపులను అడ్డుకునేందుకు కేంద్రం..విమానయాన భద్రతా నియమాలను సవరించింది. భారత్‌లో ఇకపై ఎవరైనా నకిలీ బాంబు బెదిరింపులతో విమాన రాకపోకల్ని ప్రభావితం చేస్తే..దోషులకు కోటి రూపాయల వరకు జరిమానా విధించనున్నారు. ఈమేరకు సవరించిన విమానయాన భద్రతా నిబంధనలను నోటిఫై చేస్తూ కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. భారత్‌లో ఇటీవల కొన్ని వందలాది విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వెలువడ్డాయి. దీంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది..ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దారి మళ్లింపు, సెక్యూరిటీ ప్రొటోకాల్ వంటి చర్యల వల్ల విమానయాన సంస్థలపై పెద్ద మొత్తంలో ఆర్థికభారం పడింది.

ఎన్‌టీఏకు రిక్రూట్‌మెంట్ బాధ్యత తొలగింపు

- ప్రవేశ పరీక్షల నిర్వహణకు మాత్రమే పరిమితం
- ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల ధరల తగ్గింపు
- నీట్ ఆన్‌లైనా, ఆఫ్‌లైనా అన్నదానిపై త్వరలో నిర్ణయం
- కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 17: ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉద్యోగ నియామక, ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బాధ్యతలను కేంద్రం తగ్గించింది. వచ్చే ఏడాది ఎన్‌టీఏ ఎలాంటి నియామక పరీక్షలు నిర్వహించదని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తెలిపారు. ఇక నుంచి ఎన్‌టీఏ ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షలపై మాత్రమే దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్-యూజీ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలా లేక ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలా అన్న అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొన్ని తరగతుల ఎన్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాల ధరలు తగ్గుతాయని, ప్రధాన్ ప్రకటించారు.

ఉద్యోగులకు స్టాండింగ్ పనిష్మెంట్!

న్యూఢిల్లీ: విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులను 20 నిమిషాలు నిలబడి పనిచేయాలని వారి బాస్ ఆదేశించారు. యూపీలోని నోయిడాలో న్యూ ఓక్లా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం రోజూ వందలాదిమంది వస్తుంటారు. 2005 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి డాక్టర్ లోకేశ్ ఎం గతేడాది దీనికి సీఈవోగా ఉన్నారు. ఒక వృద్ధుడు లైన్‌లో నిలబడి ఉండటాన్ని గమనించి ఆయన పనిని చూడాలంటూ ఒక మహిళా ఉద్యోగికి చెప్పాడు. 20 నిమిషాల తర్వాత కూడా ఆయన నిల్చుని ఉండటం చూసి ఉద్యోగులకు ఆయన 20 నిమిషాల శిక్ష విధించారు.